క్లుప్తంగా

నేడు తొలి తిరుపతి హుండీల ఆదాయం లెక్కింపు

పెద్దాపురం: మండలంలోని స్వయంభూ తొలి తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయ హుండీలు ఈ నెల 14న లెక్కించనున్నట్టు ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్ చారిటీస్ ఈఓ పర్యవేక్షణలో, పోలీస్, రెవెన్యూ అధికారుల సమక్షంలో హుండీల లెక్కింపు జరుగుతుందని చెప్పారు.

ఉపాధ్యాయుల ధర్నా



సామర్లకోట ఎంఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

సామర్లకోట: పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఎంఈఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించాలని, బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వీరమణి, రాజా, మండల నాయకులు నాగరాజు, శ్యామ్‌సుందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలసిన బేడబుడజ జంగాలు



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న బేడబుడజ జంగం సంఘ నాయకులు

పిఠాపురం: కేంద్ర మంత్రి నారాయణస్వామిని ఢిల్లీలోని తన స్వగృహంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ బేడబుడగ జంగం సంఘ నాయకులు కలిశారు. బేడ బుడగ జంగాలను తిరిగి ఎస్సీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీ తీర్మానం చేసి ఢిల్లీకి ఫైల్ పంపామని, ఆ ఫైల్‌ను పార్లమెంటులో వెంటనే ఆమోదించేలా చేయాలని కోరారు. దీనిపై మంత్రి నారాయణ స్వామి సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని బేడ బుడగ జంగాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎలమర్తి మధు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ కాకినాడ జిల్లా అధ్యక్షుడు మోటూరి సింహాచలం, కోనసీన జిల్లా అధ్యక్షుడు పేర్ల దుర్గా ప్రసాద్, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు పెద్దిరాజు తదితరులు ఉన్నారు.

ఆడుదాం ఆంధ్రా విజయవంతం చేయాలి



ఆడుదాం ఆంధ్రా వివరాలు వెల్లడిస్తున్న పీడీ బంగార్రాజు

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ డి.శ్రీలలిత కోరారు. బుధవారం ఉండూరు పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని సచివాలయ పరిధిలో ఆటల పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఇందులో విజయం సాధించిన వారు మండల స్థాయిలో, తదుపరి నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. 15 ఏళ్ల నిండి, ఆసక్తి ఉన్నవారు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, ఎంఈఓ పి.పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి తోట సత్యనారాయణ, పీడీ యార్లగడ్డ బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కొత్తపల్లి: మిచాంగ్ తుపాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ గొల్లప్రోలు పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు కోరారు. గొల్లప్రోలు పట్టణ బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆయన పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధాన కాలువలు, డ్రైన్లను అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బిళ్ళకుర్తి రామేశ్వర్‌రెడ్డి, ఉవలశెట్టి శ్రీను, కర్రి సత్యన్నారాయణ, కిసాన్‌మోర్చా నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విక్టరీ వెంకటేష్ పుట్టిన రోజు వేడుకలు

కొత్తపల్లి: నియోజకవర్గంలో సినీ నటుడు విక్టరీ వెంకటేష్ పుట్టిన రోజు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. పిఠాపురం పూర్ణా థియేటర్‌లో వేంకటేష్ అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వడ్డి నానిబాబు, నాని, రామకృష్ణ, బాగబాబు, సాయి తదితరులు పాల్గొన్నారు.

శివోహం

- ముగిసిన కార్తిక మాస ఉత్సవాలు
- స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరిన భక్తులు
- అలరించిన వీరభద్రుని, కేరళ నృత్యాలు
- పుష్పాలంకరణతో పంచారామ క్షేత్రం కనువిందు

సామర్లకోట: నెల రోజుల పాటు పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన కార్తిక మాస ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో పౌర్ణమి పూజలు, జ్వాలాతోరణ, స్వామివారి జన్మ నక్షత్రం సందర్భంగా ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉచిత, రూ.20, రూ.50, రూ.100 క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

వెండి జటాజూటాలంకరణ

కార్తిక మాసం ముగింపు సందర్భంగా పోలిపాడ్యమిని పురస్కరించుకుని భక్త సంఘం ఆధ్వర్యంలో వెండి జటాజూటాన్ని అలంకరించారు. ఈ నేపథ్యంలో ఆలయమంతా పూల అలంకరణతో నిండిపోయింది. మూలవిరాట్, ఉప ఆలయాలు, స్వామి వారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణలు చేశారు. జటాజూటం అలంకరణను పురస్కరించుకుని ఆలయంలో ఏర్పాటు చేసిన వీరభద్రుని నృత్యం, కేరళ నృత్యం, కోలాటం భక్తులను ఆకట్టుకుంది. స్వామి వారి జటాజూటం అలంకరణను తిలకించడానికి ఉచిత దర్శన లైను మాత్రమే ఏర్పాటు చేశారు. దాంతో కి.మీ. పొడవున భక్తులు బారులు తీరారు. సీఐ డి.సురేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల ప్రత్యేకాధికారి అల్లు వెంకట దుర్గాభవాని, ఈఓ టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ పండితులు భక్త సంఘం సభ్యులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు భక్త సంఘం ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది. భక్తులకు మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి సుబ్బారావు, నాతిపాముల సూరిబాబు, కర్రి వెంకట లక్ష్మి, చల్లా కుమారి, బొండలపు కృష్ణవేణి, ముమ్మిడి బేబీరాణి, భక్త సంఘం సభ్యులు బీవీ రమణ, చల్లా సత్తిబాబు, కౌన్సిలర్లు నేతల హరిబాబు, సేపేని సురేష్, యార్లగడ్డ జగదీశ్వరరావు సేవలందించారు. స్వామివారికి నీలిమా అధినేత అమలకంటి శ్రీనివాసరావు, మండపేట మిఠాయి దుకాణాలకు చెందిన వారు లడ్డూలను ప్రసాదంగా అందజేశారు.



పంచారామ క్షేత్రంలో వీరభద్రుని నృత్యం



పంచారామ క్షేత్రంలో బారులు తీరిన భక్తులు

రూ.73.15 లక్షల ఆదాయం

కార్తిక మాసంలో మంగళవారం వరకు ఆలయానికి రూ.73,15,761 ఆదాయం వచ్చిందని ఈఓ టీవీ సూర్యనారాయణ తెలిపారు. కార్తిక మాసానికి సంబంధించి హుండీలు లెక్కించాల్సి ఉందన్నారు. పూజా రుసుముగా రూ.51,96,171, అన్నదానానికి విరాళాలుగా రూ.21,19,590 వచ్చిందన్నారు. గతేడాది కార్తిక మాసంలో రూ.48,85,125 ఆదాయం వచ్చిందని చెప్పారు. దాంతో గతేడాది కంటే ఈసారి రూ.24,30,636 అధికాదాయం వచ్చిందని ఈఓ వివరించారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హుండీల లెక్కింపు త్వరలో చేపడతారని తెలిపారు.



అలరించిన మహిళల కోలాటం



అలంకరణలో మూల విరాట్



బాలాత్రిపుర సుందరిదేవి అమ్మవారు

రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా నాగు



రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న నాగు

కొత్తపల్లి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శిగా కొత్తపల్లికి చెందిన సానా నాగు నియమితులయ్యారు. బుధవారం తాడేపల్లిలో జరిగిన యువజన విభాగం మొదటి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి



ఉచిత శిక్షణా శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొరబాబు



శిబిరానికి హాజరైన నిరుద్యోగులు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- నిరుద్యోగులకు సొంత నిధులతో శిక్షణ తరగతులు

కొత్తపల్లి: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ, యువకుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు సూచించారు. పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయం సమీపంలో బుధవారం ఎమ్మెల్యే దొరబాబు తన సొంత నిధులతో నిరుద్యోగులకు ఉచిత శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తొలుత శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా పోటీ పరీక్షలకు శిక్షణ పొందలేకపోతున్నారన్నారు. ఇలాంటి నిరుద్యోగులైన యువతీ యువకుల కోసం ఫ్యాకల్టీ స్వామి ఇచ్చిన సలహాతో ఉచిత శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరంలో గ్రూప్-2, సచివాలయాలు, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, డీఎస్సీ పోటీ పరీక్షలకు 60 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ పొందుతున్న వారికి ఉచితంగా పుస్తకాలు అందిస్తామన్నారు. విద్యకు పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యాకానుక, అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న విదేశీ విద్య తదితర పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మన బడి నాడు - నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మార్చారన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా ఎంతో మంది ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి సుమారు 1.20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ఈ శిక్షణా శిబిరంలో అనుభజ్ఞులైన ఫ్యాకల్టీలతో సుమారు 500 మందికి ఉచితంగా శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, గంగ్రేటి శ్రీరామ చంద్రమూర్తి, జవ్వాది నాయుడు, ఆగంటి ప్రభాకర రావు, బొజ్జా దొరబాబు, మొహియుద్దీన్, కొత్తపల్లి బుజ్జీ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమాభివృద్ధి సాధ్యం



పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ



యండపల్లిలో లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



సామర్లకోట కోట్లమ్మ చెరువు వద్ద కార్యక్రమంలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్

పెద్దాపురం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని పెద్దాపురం జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు అన్నారు. కాండ్రకోట గ్రామంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల కాలంలో రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నాలుగున్నరేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన సంక్షేమాభివృద్ధిని గుర్తించి, మరోదఫా వైఎస్సార్ సీపీ విజయానికి సహకరించాలని కోరారు. అనంతరం ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. తొలుత పార్టీ జెండా, పథకాల బోర్డును వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మిరియాల రాజా, సొసైటీ అధ్యక్షుడు పల్ల గంగారావు, ఉప సర్పంచ్ జోకా నానాజీ, గంటా రామస్వామి, నల్లల గోవిందు, నూకాలమ్మ దేవస్థానం చైర్మన్ గవరసాని వీరాస్వామి, లక్కాకుల కృష్ణ, పంచాయతీ కార్యదర్శి బషీర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయ్

కొత్తపల్లి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపిస్తాయని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ అన్నారు. మండలంలోని యండపల్లిలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ సమకూర్చిన కిట్లను పంపిణీ చేశారు. గ్రామ సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ప్రారంభించారు. మెయిన్ సెంటర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ ఉమ్మిడి జాన్, జ్యోతులు చక్రబ్బాయి, సర్పంచ్ శ్రీలం పెద అప్పారావు, గుండ్ర శ్రీధర్, గుండ్ర జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు అందించేందుకే జగన్ కృషి

సామర్లకోట: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు మరింత చేరువ చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక కోట్లమ్మ చెరువు వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం జరిగింది. సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారుల జాబితా బోర్డును ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని సచివాలయాల్లో ఈ కార్యక్రమాలు జరుగుతాయని, ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిన వారి అభిప్రాయాలను సేకరిస్తున్నట్టు వివరించారు. పథకాలు రాని వారుంటే గుర్తిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పాలిక కుసుమ చంటి, మర్రి శేషారావు, గుబ్బల సత్యనారాయణ, జట్ల మోహన్, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్, గృహ సారథుల కన్వీనర్ ఇరుసుమల్ల సాయి, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా పోలి స్వర్గం వేడుకలు



కొత్తపల్లి శివాలయం వద్ద ఓంకారం ఆకారంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



సామర్లకోట గోదావరి కాలువలో కార్తిక దీపాలు వదులుతున్న మహిళలు

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా బుధవారం పోలి స్వర్గం (పోలి పాడ్యమి) వైడుకలు వైభవంగా జరిగాయి. తెలవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, బాలాత్రిపుర సుందరీ సమేత రాజశేఖర స్వామి, శ్రీధర్మశాస్తా, వీరబ్రహ్మేంద్రస్వామి, ఉప్పాడలోని మత్స్యలింగేశ్వరస్వామి, చౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి, యండపల్లి, నాగులాపల్లి, గోర్స గ్రామాల్లోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు చెరువులు, కాలువల్లో దీపాలు వదిలారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేంచేసిన రామలింగేశ్వస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక మాసం ముగింపును పురస్కరించుకుని పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సామర్లకోట: పోలిపాడ్యమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. కార్తిక మాసం ముగింపు సందర్భంగా కార్తిక దీపాలకు వీడ్కోలు పలికారు. నెల రోజుల పాటు కార్తిక దీపాలు వెలిగించిన మహిళలు.. గోదావరి కాలువలోను, పంచారామ క్షేత్రం వద్ద ఉన్న ఆలయ పుష్కరణిలోను, స్థానిక ఐదు తూముల వద్ద ఉన్న అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న పీబీసీ కాలువలోను కార్తిక దీపాలను విడిచి పెట్టారు. తెల్లవారుజాము నుంచి కాలువలు, చెరువుల వద్ద మహిళల సందడి నెలకొంది. ఈ సందర్భంగా భక్తులు స్వామివార్లను, అమ్మవార్లను దర్శించుకున్నారు. పంచారామ క్షేత్రంలో ట్రస్టు బోర్డు సభ్యులు, ఈఓ టీవీ సూర్యనారాయణ భక్తులకు సేవలందించారు. స్థానిక రజకపేటలో ఉన్న కార్తికేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భారీ అన్నదానం జరిగింది. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు ప్రారంభించారు. రజక సంఘ నాయకులు వాకలపూడి సత్యనారాయణ, ఇరుసుమల్ల వీరబాబు, ఇరుసుమళ్ల సాయి, భక్త సంఘం నాయకులు పాల్గొన్నారు. సుమారు నాలుగు వేల మందికి అన్నదానం చేశారు.



ప్రత్యేక అలంకరణలో దుర్గాడ రామలింగేశ్వరస్వామి

విశ్వ విశాలాక్షి యజ్ఞశాలలో..

కార్తిక మాసం ముగింపు సందర్భంగా స్థానిక విశ్వ విశాలాక్షి యజ్ఞ శాలలో కార్తిక దీపోత్సవం నిర్వహించారు. హిందూ ఐక్యవేదిక, హిందూ బంధువుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

అంగన్‌వాడీల ఆందోళన

కొత్తపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు బుధవారం ఆందోళన నిర్వహించారు. కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం తహసీల్దార్ కార్యాలయాల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వర్తింపజేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘ కాకినాడ జిల్లా అధ్యక్షురాలు డి.పద్మ హెచ్చరించారు.

రెండో రోజూ అంగన్‌వాడీల సమ్మె

పెద్దాపురం: అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలంటూ పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద స్థానిక ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు చేపట్టిన సమ్మె బుధవారం రెండో రోజుకు చేరింది. ప్రాజెక్టు పరిధిలోని 283 అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేసి, వర్కర్లు, ఆయాలు నిరసనలో పాల్గొన్నారు. ఆందోళనకు సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, కరణం ప్రసాదరావు, సిరిపురపు శ్రీనివాస్, జనసేన నాయకుడు తుమ్మల బాబు మద్దతు తెలిపారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా రామసుబ్బారెడ్డి

కొత్తపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎరకం రామసుబ్బారెడ్డి, కో కన్వీనర్‌గా కొమ్మినేటి భద్రరావును నియమించినట్లు ఆ పార్టీ పిఠాపురం నియోజకవర్గ కన్వీనర్ బుర్రా కృష్ణరాజు, కో కన్వీనర్ వాసంశెట్టి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. బీజేపీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు సుబ్బారెడ్డి అన్నారు. కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా జిలకర్ర సత్తిబాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా అడబాల శ్రీనివాస్‌ను నియమించినట్లు తెలిపారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం



స్క్రీనింగ్ టెస్టుల కోసం వేచి ఉన్న జనం

సామర్లకోట: రెండు రోజుల పాటు స్థానిక పూర్ణా కల్యాణ మండపంలో నిర్వహించిన క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరంలో 980 మందికి పరీక్షలు చేసినట్టు గుణ్ణం చంద్రమౌళి చారిటబుల్ ట్రస్టు అధినేత చంద్రమౌళి తెలిపారు. ట్రస్టు ఆధ్వర్యంలో మంగళ, బుధవారాలు క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించగా, నియోజకవర్గ పరిధిలోని అనేక మంది తమ పేర్లు నమోదు చేయించుకున్నారు. ఆధునిక పరికరాలతో హైదరాబాద్ నుంచి వచ్చిన రెండు బస్సుల్లో టెస్టులు నిర్వహించారు. నలుగురు వైద్యులు పరీక్షించారు. సాధారణంగా స్క్రీనింగ్ టెస్టులకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతుంది. ట్రస్ట్ సభ్యులు బిక్కిన రాజశేఖర్, గోలి దొరబాబు, కాళ్ల రవిబాబు, అందుగుల జార్జి చక్రవర్తి, అడబాల చిట్టిబాబు రోగులకు సేవలందించారు. కీలకమైన క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు ఉచితంగా చేయడానికి ఏర్పాటు చేసిన ట్రస్టు అధినేత గుణ్ణం చంద్రమౌళి, డాక్టర్లను భారతమాత సేవా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర సత్కరించారు.

16, 17 తేదీల్లో మహబూబ్ సుభాని జెండా గంధోత్సవం



గంధోత్సవానికి సిద్ధమైన హజరత్ మహబూబ్ సుభాని జెండా

పెద్దాపురం: హజరత్ మహబూబ్ సుభాని జెండా గంధోత్సవానికి స్థానిక కవాడివీధి జెండా జంక్షన్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయని జామియా మస్జిద్ కమిటీ సభ్యులు, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముస్లిములు భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ వేడుకలు ఈ నెల 16, 17 తేదీల్లో జరుగుతాయన్నారు. 16న ఉదయం ఖురాన్ ఖానీ, మధ్యాహ్నం మూడు నుంచి జెండా వద్ద నుంచి గంధం(సందల్) ఊరేగింపుతో ఫకీర్ల మేళా, బ్యాండు, బాణసంచాలతో పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారని చెప్పారు. రాత్రి 8 గంటలకు ఊరేగింపు జెండా జంక్షన్‌కు చేరుతుందన్నారు. అక్కడ ఫాతెహా ఖానీ అయ్యాక గంధం పూస్తారని వివరించారు. 17న సాయంత్రం వస్తాదానంతో పాటు భోజన విందు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ వేడుకలకు ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి, వార్డు కౌన్సిలర్ సయ్యద్ అమీనాబీబీ, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎస్ఏ ఖాదర్ హాజరవుతారని పేర్కొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



మున్సిపల్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళితులు

పెద్దాపురం: దళితుల ఐక్యతతో అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర నాయకులు తాడి బాబ్జీ, జిల్లా అధ్యక్షుడు తాడి ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో బుధవారం దళిత ఐక్యవేదిక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితవాడల్లో సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లాలోని పరిశ్రమల్లో స్థానిక దళిత యువతకు అవకాశం ఇవ్వాలన్నారు. పెద్దాపురం మాలల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ దళిత యువత విద్యలో రాణించి, మంచి ఉద్యోగావకాశాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రాల యాకోబు, ఆరెళ్లి వీర్రాఘవులు, జాలా దావీదు, పెద్దింటి మరిదయ్య, బేదంపూడి సత్తిబాబు, టేకి శ్రీను. తలారి ధరేంద్ర, కొండయ్యపేట, క్రిష్టియన్ పేట యూత్ పాల్గొన్నారు.

8 వేల ఎకరాల్లో పంట నష్టం



రమణక్కపేటలో పంట పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ స్వాతి

కొత్తపల్లి: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పిఠాపురం నియోజకవర్గంలో 8 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు పిఠాపురం ఏడీఏ స్వాతి తెలిపారు. మండలంలోని రమణక్కపేటలో నీట మునిగిన పంట పొలాలను బుధవారం ఆమె పరిశీలించారు. మొలకెత్తిన ధాన్యాన్ని, తడిసిన ముద్దయిన వరి పనలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏలేరు వరద ఉధృతి, ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా పంట నష్టం వాటిల్లిందన్నారు. గొల్లప్రోలు మండలం నుంచి వరద నీరు పోటెత్తడంతో రమణక్కపేటలో పొలాలు నీట మునిగాయన్నారు. పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేయడానికి ప్రత్యేక బృందాలను నియమించినట్టు తెలిపారు. మండల వ్యవసాయాధికారి జోగిరాజు, వ్యవసాయ శాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.